నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | మార్చి 20, 2025 | www.navatelangana.com

సీఐటీయూ నాయకుడిని అరెస్టు చేసి రామారెడ్డికి తరలింపు



నవతెలంగాణ- రామారెడ్డి

ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను, హక్కుల సాధనలో భాగంగా కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహించడానికి వెళ్లిన సిఐటియు నాయకులను, ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తుండగా, జిల్లా ఆశా వర్కర్ల గౌరవాధ్యక్షులు జే రవీందర్ ను రామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. పోలీసులు అతి ఉత్సాహంతో ఆశా వర్కర్లతో పాటు, యూనియన్ నాయకులను అక్రమంగా, అతి కిరాతకంగా అరెస్టు చేసి, సెల్ ఫోన్లను లాక్కొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించడానికి ఖండిస్తున్నామని, పోలీసుల అతి ఉత్సాహం మంచిది కాదని, ప్రజాస్వామ్యంలో హక్కుల సాధన కోసం నిరసనలు, ధర్నాలు చేసుకోవచ్చని పోలీసులు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆశాల అరెస్ట్



నవతెలంగాణ-తాడ్వాయి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌కు వెళ్తున్న ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సదాశినగర్, భిక్కనూర్, మాచారెడ్డి, తాడ్వాయి, గాంధారి, మండలాలకు చెందిన 68 మంది ఆశ కార్యకర్తలను డీసీఎం వ్యాన్‌లో కామారెడ్డి నుండి తాడ్వాయి పోలీస్ స్టేషన్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒక్కటి గంటల వరకు అరెస్టు చేసి తాడ్వాయి పోలీస్ స్టేషన్లో ఉంచారని ఆశ కార్యకర్తలు తెలిపారు. శాంతియుతంగా నిరసన చేపట్టేందకు వెళ్తుండగా.. ప్రభుత్వం పోలీసులతో తమను అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధించిందని వాపోయారు. ఆశాలకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

అరకొర కేటాయింపులే

- హామీల అమలుకు నిధులేవి..?
- రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి పెదవివిరుపు
- ప్రధాన రంగాలను విస్మరించారని ఆరోపణలు
- విద్యారంగం విస్మరించినట్టు విద్యార్థి సంఘాల మండిపాటు
- అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకెళ్లే బడ్జెట్ : కాంగ్రెస్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లపై పలువురు పెదవి విరిచారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు నిధులు సరిపడా కేటాయించలేదని, పలు పథకాల ఊసె ఎత్తలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అరకొర కేటాయింపులతో పథకాలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అటు అభివృద్ధి ఇటు సంక్షేమాన్ని సమానంగా తీసుకెళ్లే విధంగా ఉందని కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి



హామీల అమలుకు కేటాయింపులు శూన్యం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు



కంఠేశ్వర్ : రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన మూడు లక్షల 4945 కోట్ల బడ్జెట్లో అంకెలు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు తగిన కేటాయింపులు జరగలేదు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా 57 సంవత్సరాల్లోపు ఉన్న ప్రతి ఒక్క మహిళకు 2500 రూపాయల భృతిని అందజేస్తామని హామీ అమలు కొరకు ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించలేదు. అదేవిధంగా వృద్ధులు వితంతువులకు పెంచుతామన్న పెన్షన్ గాని వికలాంగులకు ఇస్తామన్న పెన్షన్ గాని రైతులు పండించే మిగతా పంటలకు ఇచ్చే బోనస్ విషయంలో కేటాయింపులు చేయలేదు. నిజాంసాగర్ శ్రీరామ్ సాగర్ ఆయకట్టు పెంపుదల కొరకు పూడికతీత పనులకు కానీ మరమ్మతులకు కానీ ఎత్తిపోతల అమలుకు గాని బడ్జెట్లో నిధులు కేటాయింపు జరగలేదు.

నిజాంషుగర్ పరిశ్రమ, నిజామాబాద్ కోఆపరేటివ్ షుగర్ పరిశ్రమ పునరుద్ధరణకు పసుపు శుద్ధి కర్మాగారాన్ని నిర్మించటానికి ప్రభుత్వం నిధులను కేటాయించలేదు. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి కావలసిన నిధులను 8 మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు కానీ ఏర్పాటు కొరకు అదేవిధంగా విమానాశ్రయ నిర్మాణానికి నిజామాబాద్ నగర అభివృద్ధి కొరకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను విస్మరించటమే అవుతుంది. నిరుద్యోగ భృతి పైన ఈ బడ్జెట్లో కేటాయింపులు జరుపకపోగా స్కీం వర్కర్లైన అంగన్వాడి ఆశ మధ్యాహ్నం భోజనం తదితర కార్మికులకు వేతనాల పెంపుదలపై ఎటువంటి కేటాయింపులు చేయలేదు. ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీగా మాత్రమే ఉంది.

అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకువెళ్లే బడ్జెట్

- తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ సంక్షేమాన్ని అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకువెళ్లే విధంగా ఉంది. ఒకపక్క రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళుతూ ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఐటీ, వ్యవసాయ రంగం కోసం అత్యధిక నిధులు కేటాయించడం హర్షణీయం. అదేవిధంగా సంక్షేమం విషయంలో రైతు భరోసా, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించడం, స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువకులకు వృత్తి నైపుణ్యం అందించి స్వయం ఉపాధి కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఒరవడి సృష్టించింది. అభివృద్ధి సంక్షేమం సమనంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. గతంలో 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ విస్మరించిన అంశాలన్నింటికీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించింది. అన్ని వర్గాలు ఆదరించే విధంగా ఎస్సీ సంక్షేమానికి 40 వేల కోట్ల రూపాయలు, ఎస్టి సంక్షేమానికి 17వేల కోట్ల రూపాయలు, మైనార్టీ సంక్షేమానికి 3500 కోట్ల రూపాయలు కేటాయించారు. కచ్చితంగా తెలంగాణ బడ్జెట్ దేశంలోని నంబర్ వన్ నిలుస్తుంది. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ,ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి చిన్నచూపు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్

నవతెలంగాణ-కామారెడ్డి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం చేశారు. కేవలం 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. విద్యా రంగం అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి కానీ రాష్ట్ర ప్రభుత్వం అలా చేయలేదు. పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ ల గురించి ప్రభుత్వం బడ్జెట్ లో కేటాయింపులు చేయలేదు. వెంటనే బడ్జెట్ ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాము.



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్

ఆత్మవిశ్వాసం ఉంటే అద్భుతాలు

జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

దివ్యాంగ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉంటే జీవితంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష కామారెడ్డి జిల్లా భారతీయ దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ శిబిరాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దివ్యాంగులను వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2014 లో ఒక దివ్యంగా విద్యార్థి సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో టాపర్‌గా నిల్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జిల్లాలో గుర్తించబడిన 207 మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. భవిత కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్నటువంటి సహిత విద్య కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీణ, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, అలీమ్ కో ప్రతినిధులు, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు నాగ వేందర్, కృష్ణ చైతన్య, వేణుగోపాల్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ పతి , ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, సహిత విద్య రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మల్లుస్వరాజ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

సమ సమాజ స్థాపనకు చివరివరకు పోరాడిన వ్యక్తి మల్లు స్వరాజ్యం

- మూడవ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి సీపీఐ(ఎం) కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్నత భూస్వామ్య కుటుంబంలో జన్మించిన మల్లు స్వరాజ్యం పేద ప్రజల కష్టాలను దూరం చేయటానికి దోపిడీ లేని సమాజం నిర్మించాలని తపనతో సీపీఐ(ఎం)లో చేరి వివిధ స్థాయిలో పనిచేసే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వాముల దురగాథలకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కష్టజీవులను కదిలించి నిజాం సైన్యాన్ని ఎదిరించి పోరాడిన ధీరవనిత అని అన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రజలను సంఘటిత పరిచారని దోపిడి లేని సమసమాజ నిర్మాణమే ఆమెకు సరైన నివాళి అని ఆయన అన్నారు. మహిళలను వంటింటికే పరిమితం చేయాలని మనువాద ఆలోచనలు ఉన్న కాలంలో మహిళా అబల కాదు సబలా అని నిరూపించారని ఆమెను స్ఫూర్తిగా తీసుకొని అనేకమంది మహిళలు పోరాటాల్లోకి వచ్చారని తెలిపారు. అనంతరం తెలంగాణ సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి ఆనందచారి మాట్లాడుతూ.. భూస్వాముల గుండెల్లో గుబులు పుట్టించిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని ఆమె చూపిన బాటలో పయనించినప్పుడే దోపిడీ లేని సమ సమాజం ఏర్పాటు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జిల్లా నాయకులు నగర నాయకులు కటారి రాములు, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం ఆరుపాళ్లు.. పని మూడు పాళ్లుగా బడ్జెట్


- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకటరాములు



కంఠేశ్వర్ : పేదలకు సంవత్సరానికి రూ.12,000 ఇస్తానన్నారు. అలాగే ఉపాధి పని దినాలను 150కి పెంచి కనీస వేతనం 400 ఇస్తామన్నారు. పట్టణ ప్రాంతంలో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తామ న్నారు. వీటి అడ్రస్ ఎక్కడ బట్టి గారు ? అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు ఒరిగింది ఏందో చెప్పండి బట్టి గారు ? రేషన్ కార్డుల గురించి స్పష్టత లేదు, ఇందిర మ్మ ఇండ్ల గురించి స్పష్టత లేదు, వైద్య ఆరోగ్య పథకానికి కేటాయించిన నిధులు చూస్తుంటే ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే వాళ్లకు పది లక్షల రూపాయలు ప్రశ్నార్థకమే. కౌలు రైతులకు రైతు భరోసాని అమలు చేస్తామన్నారు. అది కనుచూపుమేరలో కనిపించట్లేదు. మరి బడ్జెట్ ఎవరికోసం ప్రవేశపెట్టినట్లో అర్థం కావట్లేదు. ఇచ్చిన హామీలన్నిటిపై సమగ్రంగా సమర్థవంతంగా సవరించి పేదలకు, కూలీలకు ప్రభుత్వంపై వ్యతిరేకత రాకముందే ప్రయోజనార్థకంగా మార్చాలని తెలంగాణ వ్యవసాయ కారణంగా డిమాండ్ చేస్తున్నది.

వ్యవసాయ రంగంపై చిన్నచూపు

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరామ్ నాయక్



నవతెలంగాణ-కామారెడ్డి

2025 - 26 లో వ్యవసాయ రంగానికి రూ.18,101 కోట్లు, పశు సంవర్ధనకు రూ.1,657 కోట్లు, సహకార రంగానికి రూ.158 కోట్లు, అడవుల పెంపకానికి రూ.1,022 కోట్లు మరియు ఇరిగేషన్‌కు రూ.23,330 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం వ్యవసాయ రంగానికి మాత్రమే రూ.33,493 కోట్లు కేటాయింపు చేశారు. ఈ సంవత్సరం రుణమాఫీకి కేటాయింపులు లేవు. ఈ బడ్జెట్‌ను బట్టి రుణమాఫీ లేనట్టు గుర్తించాలి. 2024 - 25 బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.10,611.88 కోట్లు మాత్రమే కేటాయింపు చూపారు. ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతకు ప్రోత్సాహం ఇవ్వలేదు. హార్టికల్చర్ అభివద్ధికి కేటాయింపులు లేవు. ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రం కూరగాయలు, పప్పులు, ఉల్లి, వంటనూనెలు, పంచదార దిగుమతులు చేసు కుంటున్నాం. దీనిని భర్తి చేయడానికి వ్యవసాయా భివృద్ధికి ప్రణాళిక రూపొందించి అందుకు తగిన నిధులు కేటాయించాలి. యాంత్రీకరణకు రూ.25.47 కోట్ల కేటాయింపు చూస్తేనే ప్రభుత్వం వ్యవసాయం పట్ల చిన్నచూపు చూసినట్లు కనబడుతుంది. రైతు భరోసా కింద రూ.13,603 కోట్లు కేటాయింపు చూపినా ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. యాసంగి పంటల కోత కాలం దగ్గరకు వచ్చింది. రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధనల కేంద్రాలకు కేటాయింపులు లేవు. జాతీయ ఆహార భద్రత నూనెగింజల అభివద్ధి వ్యవసాయ విస్తరణ రాష్ట్రీయ క్రిషీ వికాస్ యోజనలకు కేటాయింపులు లేవు. ఆయిల్ పామ్ తోటల అభివద్ధి గురించి విస్తృత ప్రచారం చేసిన ప్రభుత్వం అందుకు తగిన నిధులు కేటా యించలేదు.

జాబ్ క్యాలెండర్ ప్రస్తావనే లేదు

- దేగాం యదాగౌడ్ టీడీపీ కన్వీనర్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రస్తావన లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకే ఎలాంటి ప్రతిపాదనలు లేవు. మహిళలు, వృద్ధులకు పెన్షన్ పెంపు లేనట్టే. నిజామాబాద్ జిల్లా అభివృద్ధి ప్రస్తావన లేకపోవడం, వాస్తవ అంచనాలకు ఈ బడ్జెట్ దూరంగా ఉందని అన్నారు.

కార్మికులకు మొండిచేయి

- సీఐటీయూ నాయకులు వెంకట్ గౌడ్



నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. గద్దె ఎక్కిన తర్వాత కార్మికుల సంక్షేమం మరిచి పోయారని వేతనాలు కుదింపు చర్యలు ఉన్నాయని అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం రాష్ట్ర బడ్జెట్లో డబ్బులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆశాల గోడు పట్టరా..?



కామారెడ్డిలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఆశాలు, సీఐటీయూ నాయకులు

- రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనంగా చెల్లించాలి
- ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే మార్చి 24న చలో హైదరాబాద్
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఇరు జిల్లా కేంద్రాల్లో ధర్నా
- కామారెడ్డిలో పలువురిని అరెస్టు చేసి వివిధ స్టేషన్‌లకు తరలింపు

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,000/-లు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపట్టి, వినతులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం వారి గోడును పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే మార్చి 24న ఆశాలతో కలిసి చలో హైదరాబాద్‌కు తరలివచ్చి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని' సీఐటీయూ నాయకులు స్పష్టంచేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. కాగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి తరలుతున్న పలువురు ఆశాలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న వివిధ మండలాల పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. తాడ్వాయి పోలీస్ స్టేషన్‌కు వివిధ మండలాల ఆశాలను తరలించారు. కాగా సీఐటీయూ నాయకులు రవీందర్‌ను అరెస్టు చేసి రామారెడ్డికి తరలించారు. పోలీసుల అక్రమ అరెస్టులను అధిగమించి వందలాది మంది ఆశాలు కలెక్టరేట్‌కు తరలివచ్చి సీఐటీయూ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా.. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాగా పోలీసుల సూచనతో డీఎంఅండ్‌హెచ్‌వో బయటకు రాగా వారికి వినతిపత్రం అందజేశారు.



నిజామాబాద్‌లో ధర్నాచౌక్‌లో బైటాయించి నినాదాలు చేస్తున్న ఆశాలు, సీఐటీయూ నాయకలు

కంఠేశ్వర్ : నిజామాబాద్‌లో ధర్నా చౌక్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18,000 లు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు ఆందోళనలు, వినతి పత్రాలు అందజేస్తే.. హామీ ఇచ్చి విస్మరిస్తున్నారని అన్నారు. ఆశ వర్కర్ల ఆందోళనకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, ఇప్పటికైనా ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం ప్రభుత్వం వెంటనే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ధర్నా వద్దకు డీఎంహెచ్వో రాజశ్రీ రాగా.. ఆశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డిఎంహెచ్ఓ రాజశ్రీ మాట్లాడుతూ.. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్తానని స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. టెస్టుల కోసం తీసే శాంపిల్ డబ్బాలను ఆశాలతో మోయించబోమని తెలిపారు. ఆదివారం సెలవు అమలు చేస్తామని ప్రభుత్వ దవాఖానలో రూముని కేటాయించినట్టు తెలిపారు. ఎన్‌సిడి లెప్రెసి టీబీ కంటి వెలుగు డబ్బులను ఇప్పించేందుకు కృషి చేస్తామని, వ్యాక్సిన్ డబ్బులు ఆశలతో మోపించకూడదని ఇతర సమస్యలపై సర్క్యులర్ జారీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సుకన్య రేణుక, చిన్న రేణుక, బలమని, రమా, లావణ్య శోభ, నర్సా, రేణుక, బలమని, సాహేరా, ఇంద్ర, భూలక్ష్మి, రాధా, లక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు. ఆశాల పోరాటాలకు వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి ఏషాల గంగాధర్, సంపూర్ణ మద్దతు తెలిపారు.

కామారెడ్డిలో ఎక్కడికక్కడ అరెస్టులు

కామారెడ్డి : కలెక్టరేట్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు కలెక్టరేట్ ఎదుటకు పెద్దఎత్తున తరలివచ్చారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుంటే పోలీసులు సిఐటియు నాయకులను, ఆశ వర్కర్లను అడుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం దేవునిపల్లి ఎస్సై రాజు సీఐటీయూ నాయకులతో మాట్లాడుతూ మీరు ఏ అధికారితో మాట్లాడాలో చెప్తే అధికారులు ఇక్కడికి పంపిస్తామని చెప్పడంతో వారి సూచన మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో అధికారిని ధర్నా వద్దకు వచ్చి నాయకులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు మెతిరాం నాయక్, కోత్త నర్సింలు, ముదాం అరుణ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నద న్నారు. తమ సమస్యలు విన్నవించుకునేందుకు వస్తుంటే.. జిల్లాలో ఆశా కార్యకర్తలను రాత్రికి రాత్రి ఎక్కడికి అక్కడ అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్యఅని, ప్రజా పాలన ప్రభుత్వంలో ఇలాంటి అరెస్టులు ఎలాంటి పరిపాలన గుర్తుకు చేస్తున్నాయో తెలుస్తున్నాయని అన్నారు. డిమాండ్‌లు పరిష్కరించాలని డీఎంఅండ్‌హెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ కార్యదర్శులు రాజశ్రీ, మమత, భాగ్యలక్ష్మి లత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన నాగనపల్లి బ్రిడ్జి పనులు



నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం నాగనపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నాగన్ పల్లి పసుపు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. రెండు రోజులుగా బ్రిడ్జి చివరి దశ పనుల్లో భాగంగా తారు వేస్తున్నారు. బోధన్ నుండి సాలూర వెళ్లే రహదారి నాగన్ పల్లి పాత బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున గుంతలు పడి పాత బ్రిడ్జి చువ్వలు బయటికి రావడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాంతో పలు దఫాలుగా పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా స్పందించిన అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయించారు. బోధన్ బైపాస్ నుండి సాలూర చెక్ పోస్ట్ వరకు జాతీయ రహదారి పూర్తి కావడంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీయూకు బస్సుల సంఖ్య పెంచాలి


- డిపో మేనేజర్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీకి వచ్చే బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ డిపో మేనేజర్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎబివిపి స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి మాట్లాడుతూ నిజామాబాద్ నుండి తెలంగాణ యూనివర్సిటీకి బస్సు సౌకర్యం ఉంది కానీ గత కొంత కాలంగా బస్సు మూడు పూటలు రావడం లేదన్నారు. ఎండలు ఎక్కువ అవ్వడం వల్ల సదుర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా ఉందని వివరించినట్లు పేర్కొన్నారు. సెమిస్టర్ పరీక్షలు ఉండడం వల్ల సమయానికి బస్సు రాకపోవడం వలన పరీక్షలకు వచ్చే వారికి ఇబ్బంది కలుగుతుందని, వెంటనే యూనివర్సిటీకి వచ్చే బస్సును మూడు పూటలు సమయానికి వచ్చే విధంగా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ శశి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, దుర్గ దాస్ ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

- తెలిసిన వారుంటే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఒక గుర్తు తెలియని వ్యక్తి నిస్సహాయ స్థితిలో పడి ఉన్నాడనే సమాచారం మేరకు పోలీసు వెళ్లి చూశారు. 30 ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి కొద్దిగా తెలుపు గడ్డం, తెలుపు చొక్కా ధరించి ఉన్నాడని విచారించగా తెలుగులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా అని మాట్లాడినట్లు ఎస్ హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఆ వ్యక్తికి వెంటనే చికిత్స నిమిత్తం పోలీసులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిజామాబాద్ కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఒకటి గంట ప్రాంతంలో మృతి చెందినట్లు ఎస్ హెచ్ఓ మనోజ్ కుమార్ వివరించారు. మృతుడిని ఎవరైనా గుర్తుపట్టగలిగినట్లయితే వెంటనే అ సమాచారాన్ని ఇందల్ వాయి పోలీసులకు అందజేయాలని కోరారు. ఇందల్వాయి ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ 8712659854, డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే.మల్లేష్ 8712659851కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విజేతలుగా క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

- అభినందించిన కళాశాల చైర్మన్



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

ఐటీ హబ్‌లోని డెవ్‌లాట్స్ హాకథాన్ 2025లో విజేతలుగా నిలిచిన క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ బుధవారం అభినందించారు. క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ 2వ సంవత్సరం విద్యార్థులు దొండి హృతిక్, కాచం సాయి తేజ గుప్త డెవ్‌లాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన డెవ్‌లాట్స్ హాకథాన్ 2025 లో పాల్గొని ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. వారు రూ. 25వేల నగదు బహుమతి పొందారు. ఈ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సహవిద్యార్థులంతా అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో విజయాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 10 పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

రేపటినుండి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, మండలంలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి రాజా గంగారం బుధవారం తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో 743 మంది ఆబ్సెంట్

- ముగిసిన మొదటి సంవత్సరం పరీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్ష లు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. బుధవారంతో మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయాని తెలిపారు. ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు 22వ తేదీతో ముగుస్తాయని తెలిపారు. మొత్తం 743 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని, జిల్లాలో మొత్తం 19,349 మంది విద్యార్థులకు గాను18,606 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 96.2 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు.

జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 53 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లు, హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల రెండు పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాల, వెక్టార్ జూనియర్ కళాశాల, ఎస్. ఆర్. జూనియర్ కళాశాల 2 పరీక్ష కేంద్రలు , ఎస్ . ఎస్.ఆర్. జూనియర్ కళాశాల లను తనిఖీ చేసి సమీక్షించారు.

హై పవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో 5 జూనియర్ కళాశాలలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయుదిన్ అస్లాం, కనకమహాలక్ష్మి 17 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నర్సయ్య, బాలాజీ, యమున బృందం 15 పరీక్ష కేంద్రాలను, సిటింగ్ స్కాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బల్క్ అధికారి బుద్ధిరాజ్ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

అభివృద్ధి ఓర్వలేకనే అబద్ధపు ప్రచారం

- సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని సితాయి పేట గ్రామంలో 10 లక్షలతో చేపట్టుతున్న సిసి రోడ్డు పనులను పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివద్ధి పనులకు ఓర్వలేక ప్రతి పక్షాలకు పిచ్చెక్కుతుందని అన్నారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేయని అభివృద్ధి, 15 నెలల్లో రేవంత్ రెడ్డి పాలనలో గ్రామాల్లోని ప్రజలకు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్, ---గృహాలకు ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, రానున్న రోజుల్లో రాజీవ్ యువశక్తి ద్వారా నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కొరకు సబ్సిడీపై రుణాలు ఇలా అన్ని విధాలా అభివద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్నింటిని గ్రహిస్తున్నారని వారి మాటలు పట్టించుకునేంతలో లేరని అన్నారు. కార్యక్రమంలో ధర్పల్లి, హొన్నాజీపేట్ సొసైటీల చైర్మెన్లు చెలిమెల మల్లికార్జున్, జనార్ధన్ రెడ్డి, ఆయాగ్రామాల మాజీ సర్పంచ్‌లు భగవాన్ రెడ్డి, మురళి, పుప్పాల సుభాష్, నల్ల సుదర్శన్, చెలిమెల శ్రీనివాస్, మంగిత్యా నాయక్, అబ్దుల్ హమీద్, లోక్కిడి విజయ రాములు, ఆయాగ్రామాల కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

భయం వీడితే జయం నీదే

- పరీక్షకేంద్రానికి కాకుండా పర్యాటక కేంద్రానికి వెళ్తున్నట్టు మానసికంగా సన్నద్ధం కావాలి
- రేపటినుండి పదిపరీక్షలు





నవతెలంగాణ-ఏర్గట్ల

ఈ నెల 21 నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు భయాందోళనకు గురవుతారు. పరీక్షలంటే భయం వీడాలని, పరీక్షకు కాకుండా పర్యాటక కేంద్రానికి వెళ్తున్నామని మానసికంగా సిద్ధం కావాలి. పరీక్ష బాగా రాస్తాననే పాజిటివ్ దృక్పథంతో ఉంటే విజయం సాధించవచ్చని సైకాలజిస్ట్ తెలిపారు.

పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలని, పరీక్షాకేంద్రానికి వెళ్తున్నాం అని కాకుండా మేము సరదాగా పర్యాటక కేంద్రానికి వెళ్తున్నాం అని మానసికంగా సన్నద్ధం కావాలని మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయులు(ఎస్ఏ) ఎంఎస్సి (సైకాలజీ) అరవింద్ కుమార్ తన అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ... పరీక్ష రాసే రోజు ఉదయం నిద్ర లేవగానే నేను పరీక్షను బాగా రాయగలుగుతాను అనే పాజిటివ్ దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలని అన్నారు. మొదటి రోజు పరీక్షకు 45 నిమిషాల ముందే పరీక్ష హాల్ వద్దకు చేరుకోవాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు అస్సలు పాల్పడవద్దని, దానివల్ల జీవితం నాశనమయ్యే ప్రమాదం ఉందని, మాస్ కాపీయింగ్ వల్ల సర్టిఫికెట్‌లు వస్తాయేమో గాని పోటీ పరీక్షల్లో పాల్గొని ఉద్యోగం సంపాదించే జ్ఞానం మాత్రం రాదని తెలిపారు.

పరీక్ష హాల్లోకి వెళ్ళాక చేయవలసినవి..

తనకు కేటాయించిన నెంబర్ చుట్టుపక్కల పరిస్థితి చక్కగా ఉందో లేదో చూసుకోవాలి. అయితే ప్రభుత్వం పదోతరగతి విద్యార్థులకు మొదటిసారి క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రం ఇస్తున్నారు. పరీక్ష అయ్యేంతవరకు అది విద్యార్థుల వద్దనే ఉంచుకోవాలి. ఈ క్యూఆర్ కోడ్ అనేది అక్రమ పద్ధతితో పరీక్షలు జరగకుండా

మొదటి సారిగా ఈ విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసింది. అలాగే ఓఎంఆర్ షీట్ మీద విద్యార్థికి సంబంధించిన వివరాలు ఉంటాయి. అది తమదా, కాదా.. అని ఒక్కసారి సరిచూసుకోవాలి. ఓఎంఆర్ షీట్‌ని మడవటం, రంధ్రాలు చేయడం గాని చేయరాదు. ఎందుకంటే విద్యార్థికి సంబంధించిన వివరాలు తెలిపే బార్ కోడ్స్ వాటిపైన ఉంటాయి. అలాగే బార్ కోడ్స్ మీద ఇంక్ మరకలు పడకుండా చూసుకోవాలి.

పరీక్ష ముగియగానే ఇలా చేయండి..

పరీక్ష ముగియగానే రాసిన పరీక్ష గురించి ఎవరితో చర్చించకండి. దాని వల్ల సరిగా రాశానో లేదోనని భయంతో , మరుసటి రోజు పరీక్షపై ఆ ప్రభావం పడే అవకాశం ఉంది. పరీక్షల సమయంలో ఎండలో విద్యార్థి తిరగ కూడదు. శరీరానికి అవసరమయ్యేంత నీరు తాగాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పరీక్షలు ఉండగా టివి చూడడం, సెల్ ఫోన్ తో ఆటలాడడం, బంధువుల పండగలకు, పెళ్ళిళ్ళకు వెళ్ళడం లాంటివి చేయకూడదు. పక్కా ప్రణాళిక బద్ధంగా చదివి విజయం సాధించాలి.

పరీక్ష హాల్‌కు వెళ్ళే ముందు విద్యార్థి ఏయే వస్తువులు తీసుకువెళ్ళాలి..

విద్యార్థి తన వెంట కచ్చితంగా హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ పెన్, బ్లాక్‌పెన్, స్కేల్, పెన్సిల్, ఎరేసర్ తీసుకువెళ్ళాలి. రంగుల స్కెచ్ పెన్నులు, రంగుల ఇంక్ పెన్నులు, ఎలక్ట్రానిక్ వస్తువులను అస్సలే తీసుకువెళ్ళకూడదు.

అస్సలు భయపడకూడదు..

సెంటర్‌లో సీసీ కెమెరాలు ఉన్నాయని, పోలీసులు వస్తారని, సిట్టింగ్ స్కాడ్, ఫ్లైయింగ్ స్కాడ్స్ వస్తారని, నేను చదివిన ప్రశ్నలు పరీక్షలో వస్తాయో లేదో అనే సందేహాలతో అసలే భయపడకూడదు. విద్యార్థుల శక్తిని పదిరేట్లు పెంచేందుకే ప్రభుత్వం వీటన్నింటినీ ఏర్పాటు చేసింది.

ఈ సారి ప్రభుత్వం చేసిన కొన్ని మార్పులు...

ప్రశ్నాపత్రంపై క్యూ ఆర్ కోడ్ తో పాటు సీరియల్ నెంబర్ ఉంటుంది.

జవాబు పత్రంలో 24 పేజీలు మాత్రమే ఉంటాయి.

అదనపు జవాబు పత్రాలు విద్యార్థి అడిగినా ఇవ్వబోరు.

పరీక్ష రాసే టప్పుడు విద్యార్థి చేయవలసినవి..

పరీక్ష పేపర్ ఇవ్వగానే పేపర్‌పై ఉన్న ప్రశ్నలను మొదటి నుండి చివరి దాకా తీక్షణంగా చదవాలి. మొదటగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి. జవాబులు రాసేటప్పుడు ఏ ప్రశ్నకు ఏ నంబర్ వేస్తున్నామో కచ్చితంగా చూసుకోవాలి. కొట్టివేతలు లేకుండా రాయాలి. ప్రతి ప్రశ్న రాయడానికి ముందు ఎంత సమయం తీసుకుంటున్నారని, నిర్దిష్టంగా లెక్కలు వేసుకుని, కేటాయించిన సమయంలోనే అన్ని ప్రశ్నలకు తగు జవాబులను ఆలోచించి రాయాలి. ఏ ప్రశ్నను అంత సులువుగా రాయకుండా వదిలిపెట్టరాదు. దానికి సంబంధించిన జవాబు ఆలోచించి రాయాలి.

టీయుకూ ఈశ్వరిబాయి పేరుపెట్టాలి

- కలెక్టర్‌కు దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అలుపెరుగని పోరు చేసిన తెలంగాణ పోరాట యోధులను వారి త్యాగాలను స్మరించే విధంగా వారి పేర్లను తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు, సంస్థలకు పెట్టి గౌరవించాలని సంకల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీకి తొలి దశ తెలంగాణ పోరాట యోధురాలు ఫైర్ బ్రాండ్ ఈశ్వరీబాయి పేరును పెట్టి గౌరవించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకి నిజామాబాద్ జిల్లాలోని దళిత ప్రజాసంఘాల జేఏసీ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు టీమ్ కన్వీనర్ సక్కి ఉదయ్, దేవిదాస్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిట్టేటి మోహన్ రావు, జనరల్ సెక్రెటరీ నాంది వినయ్, భీమ్ ఆర్మీ జిల్లా జనరల్ సెక్రెటరీ బత్తుల కిష్టయ్య, డిక్కీ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటరమణ, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు అబ్బి ప్రగతి, ఆల్ మాలా స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్, ఉపాధ్యక్షులు తర్ల లక్ష్మణ్ మాట్లాడుతూ..తొలి దశ తెలంగాణ పోరాటంలో ఎవరెన్ని ప్రలోభాలకు గురిచేసిన పదవులకు ఆశపడకుండా తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రజాక్షేత్రంలో నిలిపిన తెలంగాణ పోరు వనిత ఈశ్వరి బాయి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సేవలకు గుర్తుగా తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఆమె పేరును ప్రతిపాదించిన సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాన్ని కొందరు దళిత వ్యతిరేకులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళిత అణగారిన కులాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం కృషిచేసిన ఈశ్వరీబాయి పేరును తెలంగాణ విశ్వవిద్యాలయానికి పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆమె తెలంగాణ రాష్ట్రానికి అందించిన సేవలకు తగిన గుర్తింపును ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు శెట్పల్లి నారాయణ, రాజేందర్, రఘు, ప్రభాస్, రవి, మురళి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేపీ గంగాధర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్, డిపిఓ, మండలాల అభివృద్ధి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పడి 15 నెలలు గడిచినప్పటికీ పంచాయతీ కార్మికులకు ఎటువంటి జీతాలు పెరగలేదని, ఈఎస్ఐ, ఫ్రీ ఆఫ్ పర్మినెంట్ జీవిత బీమా, బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనె తరతరాలు వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు.

విలీన సభను విజయవంతం చేయాలి..

రాష్ట్రంలో ఉన్న తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయు యూనియన్‌లో విలీనం ఈనెల 27న డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలోని గ్రామ కళ్యాణ మండపంలో ఉంటుందని వివరించారు. ఈ విలీన సభకు అధ్యక్షులుగా ఎం. దాసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపన్న పాల్గొంటారని ఈ రెండు విలీన సభను జిల్లాలో ఉన్న పారిశుధ్య కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రం ఆవిష్కరణలో మెంట్రాజ్ పల్లి గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ షేక్ అసిఫోద్దిన్,సాయిలు, పాండు, కవి సాయిలు, దావీదు, సంఘం సాయన్న తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ సబ్బండ వర్గాలను నిరాశపరిచింది

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి సంబంధించి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సబ్బండ వర్గాలను నిరాశపరిచిందని నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకే కులానికో కార్పొరేషన్ ఏర్పాటు చేశారు తప్పితే వాటి అభివృద్ధికి గత బడ్జెట్‌లో కానీ ప్రస్తుత బడ్జెట్‌లో కానీ చిల్లి గవ్వ కూడా కేటాయింపులు జరగలేదన్నారు.

తెలంగాణ స్వరాష్ట్రం కోసం అసువులు బాసిన అమరుల కుటుంబాలకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపెట్టిందని మండిపడ్డారు. అమరుల కుటుంబాలకు 25 వేలు, ఉద్యోగం, ఇండ్ల ఊసే బడ్జెట్‌లో లేదని అన్నారు. ఐటీ అభివృద్ధికి కేవలం 774 కోట్లు, కానీ మైనార్టీల సంక్షేమానికి 3,591 కోట్లు ఇచ్చిందని, అభివృద్ధికి బదులుగా మతపరమైన మోజుకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తూ యువత భవిష్యత్తుతో ఆటలు ఆడుతుందని మండిపడ్డారు.

బీసీ సంక్షేమానికి లక్ష కోట్లు అన్ని ఎన్నికల ప్రచారంలో ఊదరకొట్టిన కాంగ్రెస్ గత బడ్జెట్ లో 9200 కోట్ల కేటాయించి ఈ బడ్జెట్ లో కేవలం 11 ,400 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. బీసీ అభివృద్ధికి తక్కువ నిధులు కేటాయింపు అంటే వారిని అణగదొక్కే ప్రయత్నమే అన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అని బట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్దాలు చెప్పారని, దీనిలో ఎంత మంది రైతు కూలీలకు 12 వేలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు. మహిళలకు 2500, తులం బంగారం, నిరుద్యోగులకు 4 వేల భృతి సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాల ఊసే లేదన్నారు.

జీవన నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పిఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఇంచార్జి సుజలత ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై డా. లక్ష్మణకుమార్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... జీవన నైపుణ్యాలు అవసరమని అన్నారు. వాటిలో సమస్య పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, నిర్ణయం తీసుకోవడం, లక్ష్యాన్ని నిర్దేశించడం, భావోద్వేగ మేధస్సు, సమయ నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ముఖ్యమైనవన్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... తమ సామర్థ్యాన్ని నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు డిజిటల్ ల్యాబ్‌లు, లైబ్రరీలు ఉపయోగించుకోవాలన్నారు. సుజలత మాట్లాడుతూ..... జాతీయ విద్యా విధానం 2020యితీ అనుగుణంగా విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగనాథ్, రామారావు, అశోక్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు ప్రధానం

- వైస్ ఛాన్సలర్ టి.యాదగిరిరావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైస్ ఛాన్సలర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో యాన్యువల్ డే 2025 స్పోర్ట్స్ మీట్ ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు యూనివర్సిటీ క్రీడా మైదానంలో బుధవారం ప్రారంభించి ఈ క్రీడలు 19 మార్చి నుండి 29 మార్చి వరకు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వైస్- ఛాన్సలర్ ప్రొఫెసర్. టీ. యాదగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులకు యూనివర్సిటీ లో వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలు బాలురకు బాలికలకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఈ సదవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.కళాశాల అధ్యాపకులకు వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థి జీవితంలో ౦-సజనాత్మక శక్తి పెరుగుదలకు మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన అంతర్గత ౦-సజనాత్మక శక్తిని ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మామిడాల ప్రవీణ్, డైరెక్టర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీస్ డాక్టర్ ఏ పున్నయ్య పాల్గొన్నారు.ఈ క్రీడల సమన్వయకర్తగా డాక్టర్ జి బాలకిషన్ వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నేత తదితర పీడీలు, కోచ్ లు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం | మార్చి 20, 2025 | www.navatelangana.com

సిఆర్‌పి మహమ్మద్‌కు గురు బ్రహ్మ అవార్డు



ప్రశంసపత్రం అందజేత.. సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల విద్యాశాఖలో సిఆర్పి గా పని చేస్తున్న మహమ్మద్‌కు గురు బ్రహ్మ అవార్డును, మదర్ థెరీసా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వైజాగ్ వారు, పోస్ట్ ద్వారా అందజేయగా బుధవారం మండలంలోని మానవ వనరుల కేంద్రంలో రామారెడ్డి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఆనంద్ చేతులమీదుగా అందజేశారు. ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీపాద్, శ్రీనివాస్, గంగయ్య, లావణ్య, రాణి, రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ పోయినా తొలగని ముసుగు



నవతెలంగాణ-తాడ్వాయి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా.. పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగు తీయలేదు. నిత్యం విగ్రహం ముందు నుంచి అధికారులు తిరుగుతున్నా.. పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా దేమి కలాన్ గ్రామంలోని కొత్త బాద్ చౌరస్తా వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు అలాగనే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ముసుగు తొలగించాలని కోరుతున్నారు. ఇన్ని రోజులుగా అధికారులు పట్టించుకోకపోవడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు.



ఎండ ప్రచండ







- ఇరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- నిజామాబాద్‌లో 41.2 డిగ్రీలు,
- కామారెడ్డిలో 40.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- మున్ముందు 'అగ్నిగుండమే'
- వృద్ధులు, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలంటున్న వైద్యులు
- ఎండవేళ బయటకు వెళ్లొద్దని సూచనలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భానుడు మండుతున్నాడు. సాధారణంగా ఏప్రిల్, మే నేలలో నమోదు అయ్యే గరిష్ట ఉష్ణోగ్రతలు మార్చిలో నమోదవుతున్నారు. నిజామాబాద్‌లో అయితే ఏకంగా 41.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదవ్వడం గమనార్హం. ఇక కామారెడ్డిలో సైతం 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. భానుడి ప్రతాపంతో ఇరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఎండ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ వేళ 12 నుంచి 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని, అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే.. ఎండ నుంచి తట్టుకునేలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ.. వడదెబ్బ తాకకూండా చూసుకోవాలని, కూలీలు సైతం నీడ పట్టున ఉండి పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.



నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండటం గమనార్హం. గంట గంటకు వేడి పెరుగుతుండటంతో మధ్యాహ్నం వేళ జనసంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండకు తోడు వేడిగాలులు వీస్తుండటంతో రోడ్లు అగ్నిగోళాలుగా మండుతున్నాయి. మార్చిలోనే ఈ విధంగా ఉంటే ఏప్రిల్, మేలో ఎండలు ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బయటకు వెళ్లే ప్రజలు, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఏప్రిల్, మేలో ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం

మార్చి, ఏప్రిల్, మేతో పాటు రోహిణి కార్తెలో ఎండ లు తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తుంది. రాత్రి పూట చలి మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. దినసరి కూలీలు ఉదయం పూటనే పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం లోగా ఇంటికి చేరుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే తప్పకుండా గొడుగులు వెంట తీసుకువెళ్లాలని చెబుతున్నారు. పిల్లలున్న వారు జాగ్రత్తగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. ఎండలు అధికంగా ఉండటంతో వడగాలులు వీచే అవకాశం ఉందని, కావున మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

మట్టికుండలకు డిమాండ్

సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఈసారి ఇప్పుడు మార్చిలోనే ఎండలు భగ్గుమంటుండడంతో దాహార్తి తీర్చుకునేందుకు ప్రజలు మట్టి కుండలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పేదవాడి ఫ్రిజ్ గా పేరొందిన కుండలకు ఎండల ప్రభావంతో కుండలకు గిరాకీ పెరిగింది.

ముందు జాగ్రత్తతో వడదెబ్బకు దూరం..

పిల్లల నుంచి పెద్దల దాకా వడదెబ్బ బారిన పడి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతుంటారు. వడదెబ్బ తగిలినపుడు శరీర ఉష్ణోగ్రత పెరిగి తీవ్రమైన తలనొప్పి రావడం, నాడి వేగంగా కొట్టుకోవడం, చర్మం ఎండిపోవడం, నీరసంగా ఉండడం, మూత్రం పసుపు రంగులో రావడం, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారకస్థితిలోకి వెళ్లడం లాంటివి సూచనలు ఉంటాయి. ఈ లక్షణాలు ఉన్నప్పుడు వడదెబ్బగా గుర్తించాలని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లనిగాలి ప్రదేశానికి తీసుకువెళ్లి అతడు చేసుకున్న చుస్తులు విడిచేసి చల్లని గాలి తగిలేలా చూడాలి. అప్పుడే ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని అధికారులు తెలిపారు. సూర్యుడి నుండి వెలువడే అతి నీలలోహిత కిరణాలు తాకితే అనారోగ్యానికి గురవుతారని వైద్యనిపుణలాన్ని గుర్తుచేస్తున్నారు. ఎక్కువ నీరును తాగాలని, కృత్రిమ కూల్ డ్రింక్‌ను వాడవద్దని సూచిస్తున్నారు. బయటికి వెళ్ళేవారు తలపై టోపీని గాని తవల్ గాని ధరించాలి. పుచ్చకాయ, కొబ్బరి నీళ్ళు సంతర పండ్లను ఎక్కువగా తీసుకోవాలని నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్‌ఎస్‌ఈలాంటి వాటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. వడదెబ్బకు గురైన వారు తక్షణమే ఆస్పత్రిలో చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

'జాగ్రత్తలు తప్పనిసరి

డాక్టర్ హితేష్ సాల్వాని. మనోరమ ఆస్పత్రి జనరల్ ఫిజిషియన్



ఎండ తీవ్రత ఎక్కువ ఉందని, ప్రజలు తమ పనులను 11 గంటల లోపు ముగించుకొని తిరిగి ఇండ్లకు చేరుకోవాలి. సాయంత్రం 5 గంటల తర్వాతనే బయటకు వెళ్లాలి. ఎండలో ఎక్కువసేపు పనిచేయకూడదు. ఒకవేళ తప్పని సరైతే ఎక్కువ నీటిని తాగాలి. నెత్తిన టోపీ ధరించాలి. వృద్ధులు, వ్యాధిగ్ర స్తులు ఎండలో తిరిగేటప్పుడు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటించాలి. వడదెబ్బ బారిన పడిన వారు గ్లూకో జ్, ఎలక్ట్రోల్ ఓఆర్‌ఎసు నీటిలో కలిపి తరచూ తాగాలి. పండ్ల రసాలు, చెరుకు రసం, మజ్జిగ, కొబరి బొండాలు తాగాలి. కూల్‌డ్రింక్‌లు తాగొద్దు. ప్రాథమిక చికిత్సలో భాగంగా చల్లని నీటితో శరీరాన్ని తుడవడం, చిటికెడు. ఉప్పు, చెంచా పంచదార కలిపిన నీటిని తాగి దగ్గరలోని ఆస్పత్రిని సంప్రదించాలి.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం పట్ల హర్షం



చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న జిల్లా మహిళాధ్యక్షురాలు

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర శాసనసభలో ఏకగ్రీవంగా ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాల అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సట్టి లక్ష్మి జిల్లా నాయకులు ధ్యామని భూపతి, సాయిలు, రామారెడ్డి మండల అధ్యక్షులు రాజనర్సయ్య, రామారెడ్డి మండల ఉపాధ్యక్షులు శైలేష్, లేగ్గేల.రాజు, శివ, లింగంపేట మండల ప్రధాన కార్యదర్శి మాసాని, సాయిలు, మచారెడ్డి మండల అధ్యక్షులు బట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లుల పట్ల హర్షం



చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చిత్రపటాలకు మండలంలోని నాయకులు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడం అలాగే బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడం ఎంతో మంచి నిర్ణయం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రజాపండరి, బండారి చిరంజీవి, బుడిమే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: గాంధారి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే మదన్మోహన్ చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా బీసీ 42 శాతం పెంచినందుకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు తూర్పు రాజులు, కామెల్లి బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: సదాశివనగర్ మండల కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడుతూ చట్టసభలో ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఆమోదింప చేసినందుకు బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ఈర్షద్, నగర మండల అధ్యక్షులు సంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్య నాయక్, సొసైటీ చైర్మన్ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: ఎస్సీ రిజర్వేషన్ బిల్లు శాసనసభలో ఆమోదించడంపై మండల కేంద్రమైన తాడ్వాయిలో మాదిగ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ పలువురి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ సంఘం మండల అధ్యక్షులు బక్కోళ్ల నరసింహులు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి వేసి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి టపాకాయలు కాల్చారు. ఈ కార్యక్రమంలో బి స్వామి, కే నవీన్, బి సత్యం, స్వామి, కే స్వామి, రంజిత్, నరేష్, మాదిగ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఆమోదించడడం హర్షించదగిన విషయమని తెలిపారు. బుధవారం మండలంలోని సుల్తాన్ పెట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ప్రత్యేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం అదేవిధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు ఆమోదం పట్ల ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క, ఉత్తంకుమార్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- జీపీని సందర్శించిన డీఎల్‌పీవో



డీఎల్‌పీవోను సన్మానిస్తున్న గ్రామ సంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-బిచ్కుంద

వేసవికాలంలో గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలని సత్యనారాయణ రెడ్డి సూచించారు. గ్రామ ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్యం తాగునీటి సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ కార్యదర్శి కి ఆదేశించారు. ఇటీవల ఇన్చార్జి డీఎల్పీఓగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ రెడ్డి బిచ్కుంద గ్రామపంచాయతీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కృష్ణ, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది చంద్రకాంత్, వీరేశం, మహేష్, సంజు ఉన్నారు.

మహ్మదాబాద్ ఎంపీపీఎస్‌లో ఘనంగా యాన్యువల్ డే ప్రోగ్రాం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహ్మదాబాద్ గ్రామంలో ఎంపిపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం కాంబ్లే గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు అదరూ కలిసి యాన్యువల్ డే ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలో చక్కగా అందంగా పువ్వులు , మామిడి ఆకుల తోరణాలతో ఏర్పాట్లు చేశారు. అనంతరం మధ్యాహ్న సమయంలో గ్రామ పెద్దలను విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారికి భోజనం ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అందరూ కలిసి విద్యను అందించే ఉపాధ్యాయులకు శాలువాలతో విద్యార్థుల తల్లిదండ్రులతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో తిరుపతి, కౌలాస్ కాంప్లెక్స్ హెచ్ఎం శోభ, హెచ్ఎం కాంబ్లే గోపాల్, ఉపాధ్యాయులు లాలైయా, శ్రీనివాస్, సాయిలు, స్కూల్ చైర్మన్ లక్ష్మీభాయి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల సంరక్షణ చర్యలు

- ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

వేసవిలో ఎండ తీవ్రత నుండి మామిడి పూత మరియు కాతను రక్షించుకొనుటకు చేయవలసిన పనుల గురించి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి రైతులకు పలు సూచనలు సలహాలు బుధవారం అందించారు. ప్రతి మొక్కకు 6 నుండి 8 డ్రిప్పర్లతో రోజుకు 3 గంటలు బిందు నీటిపారుదల ఇవ్వాలని సూచించారు. 'ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నేలలో తేమ సమతుల్యతను కాపాడుకోవడానికి ఉదయం 1.50 గంటలు, సాయంత్రం 1.5 గంటలు నీటిపారుదల ఇవ్వాలి. డ్రిప్పర్లను చెట్టు కాండం నుండి 1.5 మీటర్ల దూరంలో ఉంచాలి. డ్రిప్పర్ యొక్క స్థానాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. పండ్ల పెరుగుదలను వేగవంతం చేయడానికి 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న చెట్లకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయండి. త్రిప్స్ గమనించినట్లయితే లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. చల్లండి. మామిడి తోటకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నీటిపారుదల ఇవ్వడం వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడానికి కీలకం. ఇది అత్యంత వాతావరణ ఉపశమన వ్యూహం అని పేర్కొన్నారు. సాధారణంగా మామిడి తోట వ్యాపారులు తక్కువ నీటిపారుదల లేదా ప్రత్యామ్నాయ రోజులలో ఇస్తే ఒత్తిడికి పండ్లు రాలిపోతాయి.

కూలీల సంఖ్య పెంచాలి

నవతెలంగాణ-లింగంపేట్



మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉపాధిలో రోజువారీగా కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులకు ఉపాధన సిబ్బందికి గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ ఓ మలహరి ఏపీఓ కార్యదర్శులు క్షేత్ర సహాయకులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతులను నొక్కొద్దు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నవతెలం

కాంగ్రెస్ సర్కారు తీరుపై బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ బీఆర్ఎస్ బాన్సువాడ ఇంచార్జ్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో నసురుల్లాబాద్ బస్టాండ్ వద్ద బుధవారం రాస్తారోకో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. బోధన్-బాన్సువాడ వెళ్లే రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను మర్చిపోయి ప్రశ్నించే ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేయడం, ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నసుల్లాబాద్ మండల నాయకులు గుడిసెల నర్సింలు గౌడ్, యండి అఫ్రోజ్, టేకుర్ల సాయిలు, కంషెట్ పల్లి వేంకటి, గంపల శంకర్, మంగలి సాయి, మోసిన్, శశికుమార్, దార పోశెట్టి, డీ సాయిలు, రాథోడ్ రాజు, శేఖర్, తర్గం పోచయ్య మోచి గణేష్ , శివసూరి రమేష్ యాదవ్, విజయ్ మరియు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫామ్ ఫండ్, శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలి

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఫామ్ పండ్, గ్రామ పరిశుభ్రత , శానిటేషన్ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు . ఈ సందర్భంగా గ్రామంలోని వీధులలో తిరుగుతూ గ్రామస్తులకు వాళ్ల ప్రశ్నలు అడిగి గ్రామం సమస్యల గురించి తెలుసుకున్నారు. ఉపాధి పనులు పరిశీలించి.. ఎండాకాలం కావున ఎండ తీవ్రత అధికంగా ఉందని, చిన్నపిల్లలను వెంట తీసుకురావద్దని కూలీలకు సూచించారు. ఉదయం తొందరగా పనులకు రావాలని మధ్యాహ్నం వేల పనులు చేయవద్దని కూలీలకు సూచించారు.ఆయన వెంట ఉపాధి హామీ ఈసీ స్వామి దాస్ ఉన్నారు.

ఢిల్లీలో నిరసన చేపట్టిన ఎల్ఐసి ఏజెంట్లు

నవతెలంగాణ-రామారెడ్డి

ఎల్ఐసిలో వస్తున్న మార్పుల వల్ల ప్రజలకు, ఏజెంట్లకు ఇబ్బందిగా ఉందని ఆల్ ఇండియా ఏజెంట్ల సమైక్య పిలుపుమేరకు ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో బుధవారం జరిగిన ధర్నాలో కామారెడ్డి ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు కిషోర్ చందు మాట్లాడుతూ... ప్రజలకు అనుకూలంగా ఉన్న రూ 1 లక్ష పాలసీని తిరిగి ప్రారంభించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలని డిమాండ్ చేశారు. బయలుదేరిన వారిలో లీయాఫీ నాయకులు కొండ భైరయ్య, కదం నారాయణరావు, ప్రదీప్ జైన్, ఉమాపతి, కన్న రవి, రాంశెట్టి శేఖర్, మల్లారెడ్డి, రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాతృ వందనం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాతృ వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులే భోజనాలు ఏర్పాటు చేసి అందరికీ పెట్టారు. హాల్ టికెట్లు తల్లులతోని కలిసి హాల్ టికెట్లను తీసుకున్నారు. పిల్లలు తమ తల్లుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు

- సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో సింగిల్ విండో చైర్మన్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్ద ఎక్లార గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుకు గ్రామస్తుల తరపున మద్నూర్ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస పటేల్ కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం సిసి రోడ్డు నిర్మాణం పనులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో దరాస్ సాయిలు హనుమాన్లు, స్వామి విట్టల్, గురాజీ రామ్ పటేల్, ప్రజ్ఞ కుమార్, కొండ గంగాధర్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

21న విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

- ట్రాన్స్‌కో ఏఈ మోహన్

నవతెలంగాణ-జుక్కల్

మార్చి 21వ తేదీన నియోజకవర్గంలోని జుక్కల్ ,బిచ్కుంద , మద్నూర్ , డోంగ్లి మండలాల విద్యుత్ వినియోగదారులు శుక్రవారం నాడు ఉదయం 10 గంటలకు బిచ్కుంద మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఉపకేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కొరకు పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు బాన్సువాడ ఎంపీడీసీఎల్డీఈ గంగాధర్ , జుక్కల్ ఏఈ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు ఏమనా సమస్యలు ఉంటే పరిష్కార వేదికలో పాల్గొని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

'రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగించుకోవాలి

- మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్ది అవినాష్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుద్యోగ యువత కొరకు చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని భీంగల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్ది అవినాష్ కోరారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో 5 లక్షల మందికి 6 వేల కోట్ల రాయితీ రుణాలు మంజూరు చేయనున్నారని సూచించారు. ఒక్కో లబ్ధిదారునికి 4 లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారని పేర్కొన్నారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితితో ఈ రుణాలు మంజూరు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క లకు ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులు చదువులో రాణించాలి

- జీహెచ్ఎస్ హెచ్ఎం టి.శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



దివ్యాంగులు చదువులో రాణించాలని జీహెచ్ఎస్ హెచ్ఎం టి.శ్రీనివాస్ అన్నారు. ఎస్ఎస్ఏ, 'ఏఎల్ఐఎంసిఓ' వారి సౌజన్యంతో సోమవారం నిర్వహించిన దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరంలో దుబ్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని కుమారి నమ్రతకు శ్రవణోపకరణం తల్లి దండ్రుల సమక్షంలో ఉన్నత ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాస్ ప్రదానం చేశారు. వీటిని ఉపయోగించి చదువులో రాణించాలని తెలిపారు. ఇందులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్‌బివి రాజు, ఐఈఆర్పి, లక్ష్మణ్, సంతోష్, బి.వినీత్ కుమార్, టి.కేశవ కుమార్ పాల్గొన్నారు.

ఒకేసారి మూడు బిల్లులు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీది

- సీఎం, రాహుల్ గాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం
- బీసీ రిజర్వేషన్ బిలుకు ఆమోదం తెలిపినందుకు

నవతెలంగాణ-కంఠేశ్వర్/బాల్కొండ/నిజామాబాద్ సిటీ/జక్రాన్‌పల్లి/ ముప్కాల్



నిజామాబాద్ సిటీ: మాట్లాడుతున్న నాయకులు



బాల్కొండలో..

కంఠేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ అసెంబ్లీ లో బీసీ కులగనన బిల్లును ఆమోదం తెలిపి బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచిన సందర్భంగా కాంగ్రెస్ భవన్ వద్ద జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి బట్టి విక్ర మార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మాజీ ఎంఎల్సి ఆకుల లలిత, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో రాహుల్ గాంధీ పాదయాత్ర చేసిన సందర్భంలో బీసీ కుల గణన చేసి బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశంతో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కులగణన నిర్వహించి బీసీలకు రిజర్వేషన్ పెంచినందుకు రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనే బీసీ లకు న్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని అన్నారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాటాడుతూ.. రాష్ట్రంలో బీసీ కులగణన చేసి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలని రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపట్టి అసెంబ్లీ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో కూడా బీసీ కు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని ప్రధాని మోదీ ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మాట్లాడుతూ బీసీ లకు రిజర్వేషన్ పెంచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఫిషెర్మాన్ చైర్మన్ శ్రీనివాస్, డీసీసీ డెలిగేట్ ప్రమోద్,నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, బింగి మధు సుధాన్, మహిళా కాంగ్రెస్ నాయకులు పోల ఉష, గాజుల సుజాత, అపర్ణ, నరేందర్ గౌడ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు చింటూ, ఆడే ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : రాష్ట్రంలో షెడ్యూల్ కులాల (ఎస్సీ) ఉపవర్గీకరణ బిల్లు, బీసీ రిజర్వేషన్ల బిల్లులు శాసనసభ, శాసనమండలిలో ఆమోదం పొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌట్ అరవింద్, నాయకులు ప్రవీణ్ గౌడ్, యునుస్, కుందారపు శ్రీనివాస్, అన్వర్, వివేక్, విద్యాసాగర్, మజార్, గంగాధర్, బండి మల్లేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం దేశ చరిత్రలో ఒకేసారి మూడు బిల్లులు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అన్నారు. బుధవారం నందిపేట్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచుకొని డప్పుల చప్పుళ్ళతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణ రావు, సుదర్శన్ రెడ్డికి, వినయ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ కూడా దేశం మొత్తం బీసీ కులగణన చేసి పార్లమెంట్ లో తీర్మానం చేసి బీసీ లకు ఎస్సీ లకు రిజర్వేషన్ లు ఇవ్వాలని కోరారు. బీసీ కులగణన చేపట్టి ఏడు నెలల్లోనే బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 29 నుంచి 42 శాతానికి రిజర్వేషన్లు పెంచి అసెంబ్లీలో తీర్మానం, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, రాజీవ్ యువశక్తి ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు మూడు బిల్లులు అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు నందిపేట్ మండల్ కాంగ్రెస్ పార్టీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ మైనార్టీ, ఎస్సీ సెల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండలంలోని తొర్లికొండ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణ సందర్భంగా డప్పు చప్పులతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వేల్పుల వరుణ్ మాదిగ నాయకత్వంలో, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కనక శ్రీదీప్ మాదిగ పర్యవేక్షణలో నిర్వహించారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల ఉద్యమాన్ని గుర్తుచేస్తూ మాదిగ అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంకేపల్లి విప్లవ మాదిగ, నాయకులు సంకేపల్లి గంగాధర్, సంకేపల్లి రాములు, సంకేపల్లి సందేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : రాష్ట్రంలో షెడ్యూల్ కులాల (ఎస్సీ) ఉప వర్గీకరణ బిల్లు శాసనసభ, శాసనమండలిలో ఆమోదం పొందడం, బీసీ రిజర్వేషన్ల బిల్లు సైతం అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తూ, మరోపక్క బీసీ, ఎస్సీ వర్గీకరణకు పనిచేసిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు మారువలేరన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు పూర్తి మద్దతు ఇచ్చిన వామపక్షాలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంబరాల్లో మునిగిపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందా రవి, మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఏట్టెం మహేష్, శ్రీకాంత్, గోపి యాదవ్, అబ్రార్, మల్లారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మయూర్, వేంపల్లి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఆస్తి పన్నులు చెల్లించాలి

- నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులు వెంటనే చెల్లించాలని, లేదంటే దుకాణ సమదాయాలను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ హెచ్చరించారు. బుధవారం నగరంలో రైల్వే స్టేషన్ ఎదురుగా ఆస్తి పన్ను వసూలు కోసం వాణిజ్య దుకాణాలను మున్సిపల్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్ను చెల్లించాలని, లేకుంటే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మురళి రెడ్డి ఈఈ, వార్డ్ ఆఫీసర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉత్తములు కావాలి

- ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

క్రమశిక్షణతో చదివి విద్యార్థులు ఉత్తములు కావాలని ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని తొర్లి కొండ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరికృష్ణ, సంతోష్ కుమార్, విజయలక్ష్మి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిరి లేఖలు పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-మోపాల్



మండలంలోని సిరిపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన లేఖల సంకలనం సిరి లేఖలు పుస్తకాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి పి అశోక్ ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మక రంగంలో రాణిస్తూ తమ ఆలోచనలను సరికొత్తగా ఆవిష్కరిస్తూ మున్ముందుకు వెళ్లడం సంతోషదాయకమని అన్నారు. ఈ విషయంలో సిర్పూర్ విద్యార్థులు ఒక అడుగు ముందుకేసి లేఖల రూపంలో తమ సృజన ఆలోచనలను పంచుకోవడం అభినందనీయమని, ఈ విద్యార్థులకు తెలుగు సృజన మార్గదర్శిగా వ్యవహరిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్లను అభినందించారు విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీసి మంచి అవకాశాలు కల్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందాన్ని డిఈవో అభినందించారు. కార్యక్రమంలో డిసిఇబి సెక్రెటరీ సీతయ్య గణితఫోరం బాధ్యులు కె. కాంతారావు ,టిటియు జిల్లా అధ్యక్షులు లాటికర్ రాము, పుస్తక రూపకర్త చింతల శ్రీనివాస్ గుప్త, ఉపాధ్యాయులు మోహన్, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్ మరియు పుస్తక సంపాదకులు డాక్టర్ కాసర్ల నరేష్ రావు, సిర్పూర్ పాఠశాల విద్యార్థులు అక్షయ, రచన, నందిని, శ్రీజ, తబస్సుం, వరలక్ష్మి, మాధురి, హిందూ శ్రీ, రజిత, మేఘన, హరిణి, గంగోత్రి పాల్గొన్నారు. డీఈవోను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఎంఈఓ బట్టు రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

పదవ తరగతి పరిక్షల నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందనీ మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఈ పరీక్షలకు మండల పరిధిలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండ, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాల్కొండ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిసాన్ నగర్ సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. 376 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 188 ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 564 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఉంటుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పదవ తరగతి పరీక్షలకు అన్ని సిద్ధం

నవతెలంగాణ-మాక్లూర్

ఈనెల 21 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్ష కు ఏర్పాట్లు సిద్ధం చేశామని మండల విద్యాదికారి సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం నాలుగు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మాక్లూర్, శ్రీ చంద్ర టెక్నో స్కూల్ దాస్ నగర్, జెడ్పిహెచ్ఎస్ మాణిక్ బండర్, జెడ్పిహెచ్ఎస్ మదన్ పల్లిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నాలుగు పరీక్ష కేంద్రాల్లో బాలురు 313, బాలికలు 332 మొత్తం 645 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఈనెల 21 నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు భీంగల్ మండల విద్యాశాఖ అధికారి స్వామి తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు.జెడ్‌పిహెచ్ ఎస్ ముచ్కూర్, జెడ్ పి హెచ్ ఎస్ పల్లికొండ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కృష్ణవేణి హై స్కూల్ ఈ నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు హాల్ టికెట్ పైన సెంటర్‌ని చూసుకొని వారి వారి సెంటర్లకు ఒక గంట ముందు చేరుకోవాలని తెలిపారు.మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న మొత్తం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు 790 మంది విద్యార్థులు పరీక్షలకు హాల్ టికెట్లు వచ్చాయని, ప్రతి విద్యార్థి హాజరుకావాలని సూచించారు.

ఎండి జమీల్ అహ్మద్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో హిందీ విభాగం చైర్మన్ బి ఓ ఎస్ గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం డి జమీల్ అహ్మద్ కు బెంగళూరుకు చెందిన ఇంటర్నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సోషల్ అండ్ ఎకనామిక్ రిఫార్మ్స్ అనే సంస్థ బోధన మరియు పరిశోధన రంగంలో కృషి చేస్తున్న డాక్టర్ మొహమ్మద్ జమీల్ అహ్మద్ కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డ్ ను ప్రదానం చేశారు.డాక్టర్ మహ్మద్ జమీల్ అహ్మద్ గత 30 సంవత్సరాలుగా బోధనలో సేవలు అందిస్తున్నారు. గతంలో డాక్టర్ జమీల్ అహ్మద్ కాకతీయ విశ్వవిద్యాలయంలో 15 సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, తెలంగాణలో యూనివర్సిటీ లో గత 11 సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సేవలు అందిస్తున్నారు. డాక్టర్ జమీల్ కు చెందిన 60కి పైగా పరిశోధన పత్రాలు హిందీ భాషకు చెందిన ప్రముఖ పత్రికలలో ప్రచురించాయి.మూడు పుస్తకాలు, 30కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జమీల్ అహ్మద్ తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి అభినందించారు. ఈ సందర్భంగా టూ టా అధ్యక్షులు డాక్టర్ పున్నయ్య ప్రిన్సిపాల్,డాక్టర్ ప్రవీణ్ మామిడాల, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ ఖవి, డాక్టర్ ఖురేషి, డాక్టర్ పార్వతి, డాక్టర్ గుల్ హి రాణా తదితరులు అభినందించారు.

విమర్శలు మాని అభివృద్ధిలో పోటీ పడుదాం

- పార్లమెంటులో బిసి బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి
- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పై అనుచితంగా మాట్లాడితే ఇక సహించమని, విమర్శలు మాని అబివద్ధిలో పోటి పడదామని, బిజెపి నాయకులకు చిత్త శుద్ధి ఉంటే పార్లమెంటు లో బిసి బిల్లుకు చట్టబద్ధత కల్పించి బిసి లకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఇందల్‌వాయి మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడం పట్ల మాల, మాదిగలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆరు గ్యారంటీలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినప్పటికీ నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమయోచితంగా డబ్బులను సమకూర్చుతూ ఒక్కొక్కటిగా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. మాల మాదిగలకు బీఆర్ఎస్ అంటరాని వాళ్లుగా చూసిందని వాళ్ళ ఎదుగుదలను ఓర్వలేక ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అడ్డు పడిన ఘనత బీఆర్ఎస్కు దక్కుతుందన్నారు.బిజెపి నాయకులు రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలవగానే తామేదో సాధించినట్లుగా విర్రవీగుతున్నారని, కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రానికి నిధులు తే లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర సహాయ మంతులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉన్నప్పటికీ ఎందుకు కేంద్రం నుండి నిధులు తీసుకురావడం లేదని ఆగ్రహం వ్యకం చేశారు.బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి ఆమోదం తెలపడం పట్ల బీసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం లో మంత్రులు, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి

ఌకతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించినప్పటికీ బడుగు బలహీన వర్గాలకు ఏ రోజు ఆలోచించలేదన్నారు.నేడు ఏ గ్రామంలో చుసిన ం-అభివద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. సమావేశం లో బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు చిన్ రెడ్డి సంతోష్ రెడ్డి, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు ఎల్‌బిసి గంగాధర్, తిర్మన్ పల్లి మాజీ ఎంపిటిసి చింతల కిషన్ ,బోర్ వెల్ రాజేందర్ రెడ్డి, నవీన్ గౌడ్, లారీ గంగన్న, జంగిలి లక్ష్మీ ముత్తెన్న ఆశిష్ ,వసంతరావు, మల్లన్న, వేంగల్, తోట ప్రకాష్, సాయందర్, తదితరులు పాల్గొన్నారు.

దినేష్.. దిగజారుడు మాటలు మానుకో..

- ఆర్మూర్ చిన్న బాలరాజ్

నవతెలంగాణ -ధర్పల్లి

దినేష్ కులాచారి దిగజారుడు మాటలు మానుకుని మానుకో వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ, ఎస్సి వాడ ప్రాంతాల్లో 40 లక్షలతో నిర్మించతలపెట్టిన రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను అయన ప్రారంభించారు .అనంతరం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నవోదయపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవోదయ విద్యాలయాలు జిల్లాకు ఒకటి కావాలని కేంద్రాన్ని ఒప్పించి ఎట్టకేలకు ముఖ్యమంత్రి కేంద్రంతో కొట్లాడి మంజూరు చేయించారని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ముఖ్యమంత్రి తో మాట్లాడి తన నియోజకవర్గంలో ఏర్పాటుకు స్థల పరిశీలన ,దానికి అనువైన ప్రాంతం ఐదు నియోజకవర్గాలకు అందుబాటులో ఉంటుందని జాతీయ రహదారికి సమీపంలో ఉంటుందని ప్రత్యేక దృష్టితో ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగిందని అన్నారు. మండలంలోని డిబి తండా , ధర్పల్లి గ్రామాల్లో కావలసిన 25 ఎకరాల భూమిని తాము చూపించినప్పటికీ, కలిగోట్‌లో నిర్మిస్తేనే బాగుంటుందని స్వయంగా ఎమ్మెల్యే తమకు చెప్పారన్నారు. తెచ్చింది మేము ఐతే దానికి అబద్దాలు సృష్టిస్తూ ఒక ఎంపీగా ఉంటూ అబద్దాలు మాట్లాడటం బాధాకరం అన్నారు. జిల్లా నాయకుడు అక్కసుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రతిపాదనలు పంపించినట్లు 15 రోజుల్లో పత్రాలను చూపించాలని సవాల్ విసిరారు. లేదంటే మేము పంపినట్లు సాక్షాలు చూపుతామని తెలిపారు. కేంద్రానికి బీసీ గణన చేపట్టడం ఇష్టం లేకనే బిసిలకు విభజించే పనిలో ఉన్నారని అన్నారు. రాహుల్ గాంధీ మొత్తం దేశంలోనే బిసి గణన జరగాలని పాటుపడుతున్నారని, ఆలా జరిగినప్పుడే బిసిలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నినాఎమని అన్నారు. అందుకు రేవంత్ రెడ్డి బిసిలకు రిజర్వేషన్ బిల్ పాస్ చేశారని, అందుకు మండల ప్రజల తరపున ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమస్త్రలో చెలిమెల మల్లికార్జున్, జనార్దన్ రెడ్డి, పోతన్న పుప్పాల సుభాష్, భగవాన్ రెడ్డి, మంగిత్యా నాయక్, రమేష్ నాయక్, నల్ల సుదర్శన్, అబ్దుల్ హమీద్, లింగారెడ్డి, దినకర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపకరణాలు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలకేంద్రంలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఎంఈఓ ఆనంద్ రావ్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర సెక్రెటరీ సత్యానంద్ చేతుల మీదుగా బుధవారం ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బి.ఉదయ్ మాట్లాడుతూ... ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఈ నెల 17న నిజామాబాద్ లో అలింకో క్యాంప్ వారు ఉపకరణాలకు సంబంధించిన వస్తువులను అందించగా వాటిని విద్యార్థులకు అందజేశామని అన్నారు.

వ్యవసాయ రంగం పట్ల సవతితల్లి ప్రేమ

- వైద్యంపై నిధులకోత
- సీపీఐ(ఎంఎల్.)మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ తీవ్రవిమర్శ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సంక్షేమాన్ని తెలంగాణ బడ్జెట్ విస్మరించిందని, వ్యవసాయ రంగం పట్ల సవతితల్లి ప్రేమను కనబర్చుతుందని, వైద్యంపై నిధులకోత పెట్టిందని వ్యవసాయ కూలీలపై నిధుల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని సీపీఐ(ఎంఎల్.)మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో జరిగిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆరు గ్యారెంటీల హామీతో పాటు, ప్రజాస్వామిక పరిరక్షణ హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పూర్తిగా అమలుకు పునుకోలేదన్నారు. ప్రస్తుతం 2025-26 ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు మోచేతికి బెల్లం పెట్టినట్టు ఉందన్నారు. వ్యవసాయ రంగానికి నామ మాత్రంగానే పెంచారని, వైద్యానికి, విద్యకు నామమత్రంగా కేటాయించి చేతులు దులుపుకున్నారని అన్నారు.


సంక్షేమ రంగంలో విఫలం అయినట్టుగా కనిపిస్తుందని, బడ్జెట్ లో పసుపు రైతుల పట్ల ఏమాత్రం కరుణ చూపలేదు అన్నారు. సన్నపు వడ్లకు మాత్రమే బోనస్ ఇచ్చి ఇతర పంట లు పండించే రైతులకు ఎగనామం పెట్టారని అన్నారు. రైతు నాయకులపై తెలంగాణ ఉద్యమంలో, రైతంగా పోరాటాల సమయంలో పెట్టిన కేసులను ఇప్పటికి కొట్టివేయలేదు అన్నారు. సమావేశంలో సీపీఐ(ఎం.ఎల్.) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బీ. దేవారం, సహాయ కార్యదర్శి ఆర్. రమేష్, పి.వో.డబ్ల్యూ. రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. గోదావరి, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జి.సురేష్, పార్టీ జిల్లా, డివిజన్, మండల నాయకులు ఎస్ సురేష్, ఎం. ముత్తేన్న, కే. రాజేశ్వర్, జి. కిషన్, ఏ.ప్రకాష్, జి.పరమేష్, ఆర్. దామోదర్, బి. కిషన్, పి. రమ, ఆర్. పుష్పలత, బి. బాబన్న, పి.అంబన్న, బి.కిషోర్, ఎం. లింబన్న, ఈ. రమేష్, ఎస్. కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

తై బజార్ వేలం వాయిదా

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వారం సంత వేలం కు కనీస ధర రానందున వేలంను వాయిదా వేసినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి తెలిపారు. ఈనెల 24, సోమవారం రోజుకి వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం రోజు నిర్వహించిన వేలంలో 3,51,000 రూపాయల వద్ద వేలం నిలిచిపోయిందని ఆయన తెలిపారు.

రాత్రి వేళ సీపీ తనిఖీలు



రైల్వేస్టేషన్ ముందు వాహనాలను తనిఖీ చేస్తున్న సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మంగళవారం రాత్రి నగరంలోని పలుచోట్ల ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిజామాబాద్ నగరంలోని ఎల్ఐసి చౌరస్తా, దేవిరోడ్ చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా, ఆర్ఆర్ చౌరస్తా, పెద్ద బజార్, నెహ్రూ పార్క్, హైమది బజార్, బోధన్ బస్టాండ్, రైల్వే స్టేషన్, ఆర్టీసి బస్టాండ్ ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆటో డ్రైవర్ల వాహనాలకు సంబంధించిన పేపర్స్ చెక్ చేసారు. ఎలాంటి పని లేకుండా రాత్రి సమయంలో తిరిగే యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ యందు పరిసర ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడున్నటువంటి సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. గాంధీ చౌక్, హైమది మార్కెట్ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత ట్రాఫిక్, వన్ టౌన్ పోలీసులకు ఆదేశించినట్టు తెలిసింది.

పోలీస్ కమిషనర్‌ని కలిసిన, అదనపు డీసీపీ, ట్రైయినీ కలెక్టర్



సీపీని కలిసిన అదనపు డీసీపీ, ట్రైయినీ కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నందు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా స్పెషల్ బ్రాంచ్ ఏసిపికి అదనపు డిసిపిగా పదోన్నతి వచ్చిన సందర్భంగా ఎస్.శ్రీనివాస్ రావు పుష్పగుచ్చాన్ని అందజేశారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా నిజామాబాద్ ట్రైయినీ కలెక్టర్ సంకేత్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేశారు.

సీపీని కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు..

రెడ్‌క్రాస్ నిజామాబాద్ జిల్లా శాఖ వారు కొత్త పోలీస్ కమిషనర్ సాయి చైతన్యని రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ చేపడుతున్న సేవ కార్యక్రమాలు రెడ్‌క్రాస్ సభ్యులు సిపికి వివరించారు. అందుకు గాను కమిషనర్ తలసేమియా పిల్లల కోసం త్వరలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కార్యదర్శి గోక అరుణ్‌బాబు, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డా.శ్రీశైలం, డా.రాజేశ్వర్, పిఆర్ఓ బొద్దుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎంఈవో

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండల కేంద్రంతో పాటు పోతంగల్ కాలన్ లో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను గాంధారి పోతంగల్ కాలన్ పరీక్ష కేంద్రాలను మండల విద్యాధికారి శ్రీహరి బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో వసతులు, రాత బల్లలు గదులలో లైట్లు ఫ్యాన్లు తాగునీటి వస్తువులను పరిశీలించారు. సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు నిర్భయంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత కావాలని పదో తరగత విద్యార్థిని విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు రంగా వెంకటేశ్వర గౌడ్, రంగారావు, సీఆర్పీల రాజు ,షాహిద్ తదితరులు ఉన్నారు.

కల్వరాల్ పాఠశాలలో వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కాల్వరాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. పరీక్షలు రాసేటప్పుడు భయాందోళనకు గురుకువద్దన్నారు. విద్యార్థులకు పరీక్షల అట్టలను పెన్నులను అందించారు. దానితోపాటు విద్యార్థులకు ఆ పాఠశాలలోని పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వాటర్ బాటిల్ ను కూడా అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు హాల్ టికెట్లను విద్యార్థులకు తల్లిదండ్రులతో కలిసి హాల్ టికెట్స్ సర్టిఫికెట్స్ భద్రపరచుకోవడానికి ఫైల్ ను కూడా అందించారు. కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు కుంట రాజిరెడ్డి, కుంట గంగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సలీమా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు రాజా గౌడ్, పూర్ణారావు, సుభాష్, శైలజ, కల్పన, లలిత, నందు రావు తదితరులు పాల్గొన్నారు

'కోత'ల బడ్జెట్

• విద్యా, వైద్యరంగాల నిధుల కోత • ప్రజాసంక్షేమం లేదు

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశ పరిచిందని పలుపార్టీలు, సంఘాల నాయకులు పేర్కొన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించారని, దీనివల్ల అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. నామమాత్రపు నిధులు కేటాయించి ప్రభుత్వ చేతులు దులుపుకుందని దుయ్యబట్టారు. బడ్జెట్‌ను సవరించి అధిక నిధులు కేటాయించాలని కోరారు. మరికొందరు దీన్ని ప్రజాపాలన బడ్జెట్‌గా పేర్కొన్నారు.

నవతెలంగాణ-విలేకరులబృందం

భారీ అంచనాలే తప్ప వనరుల సృష్టి బడ్జెట్ కేటాయింపులలో లేదు..

డాక్టర్ ఏ. పున్నయ్య, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ తెలంగాణ యూనివర్సిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ శాసనసభలో బుధవారం 2025-26 సంవత్సర బడ్జెట్3,04,965 కోట్ల తో ప్రవేశపెట్టారు. ఇందులో 2,26,982 కోట్లు - రెవెన్యూ వ్యయం గాను 36,504 కోట్లు మూలధన వ్యయంగాను కేటాయింపులు ఉన్నాయి. నిజానికి గత బడ్జెట్ ను పరిశీలించినట్లయితే రూ. 2.91 లక్షలు అంచనా వేసి రూ 2.20 లక్షలు మాత్రమే వివిధ ఆదాయ వనరుల ద్వారా సమకూరాయి. గత బడ్జెట్లోనే రూ. 70 వేలకోట్ల లోటుతో కొనసాగుతున్నప్పటికీ ఈ సంవత్సరం అదనంగా సుమారు లక్ష కోట్లు బడ్జెట్ ను పెంచుకోవడం అనేది అత్యాశ అవుతుంది. భారీగా బడ్జెట్ అంచనాలు ప్రభుత్వాల లక్ష్యాలుగా ఉండడం మంచిదే కానీ ఆ మేరకు వనరుల సృష్టి కూడా జరగాలి. ఈ బడ్జెట్ విద్యారంగాన్ని నిర్వీర్యపరిచింది. మానవ వనరుల అభివృద్ధి కేంద్రంగా ఈ బడ్జెట్ ఉంటుందని విద్యా కమిషన్ ఏర్పాటు చేసి విద్యా రంగంలో మౌలికమైన మార్పులు చోటు చేసుకుంటాయని ప్రచారం చేసి కేవలం రూ 23, 108 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. ఉన్నత విద్యకు నామమాత్రపు కేటాయింపులతో చేతులు దులుపుకుంది. ఈ కేటాయింపులతో బోధనా పరిశోధన రంగాలు బలహీనపడతాయి.

ఇది అభివృద్ధి, సంక్షేమ బడ్జెట్

తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్. కేశవులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుని, వ్యవసాయం, మహిళా సంక్షేమం, యువత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యం చేస్తూ ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయరంగానికి పెద్ద పీట వేస్తూ, పల్లెల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ గ్రామీణ అభివృద్ధి పథకాలు, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపునకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు పేద మహిళలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ఇందిరా మహిళా శక్తి మిషన్ లాంటి గొప్ప నిర్ణయాలు ఉన్నాయని డాక్టర్ కేశవులు పేర్కొన్నారు

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

పిడిఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో విద్యారంగ అభివృద్ధికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు, రాష్ట్ర బడ్జెట్ మొత్తం (3,04,965 కోట్లు) , విద్యారంగానికి కేవలం 7.57 శాతం (23,108 కోట్లు) మాత్రమే కేటాయించారు. తెలంగాణ యూనివర్సిటీకి కూడా గత ఏడాది మాదిరిగానే బడ్జెట్ కేటాయించారు. ఈ నిధులు కేవలం జీతభత్యాల కే సరిపోతాయి. కానీ విద్యారంగా అభివృద్ధికి ఏమాత్రం సరిపోవు. అసెంబ్లీ బడ్జెట్లో నిజామాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కాలేజీ ఊసే లేదు. వెంటనే అసెంబ్లీ బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి.

విద్యా, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయిచాల్సింది

సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



విద్యా, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించి ఉంటే సబ్బండ వర్గాల ప్రజల బడ్జెట్‌గా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం విద్యా రంగానికి 15 శాతం, వైద్య రంగా నికి 20 శాతం నిధులు కేటాయించి ఉంటే బాగుండేది. మధ్యతరగతి, పేదల కుటుంబంలో ఎంత పని చేసినా సుమారు 80 శాతం విద్యా, వైద్యానికే ఖర్చవుతున్నాయని ఎన్నికల్లో గెలుపు కోసం ఇస్తున్న వాగ్దానాలను మరియు ఉచితాలను పక్కనపెట్టి విద్యా, వైద్య రంగానికే పెద్దపీట వేసి ఉంటే మధ్య తరగతి, పేద ప్రజలు సంతోషించే వారు. తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్రానికి పన్నుల రూపాన రూపాయి వెళితే కేవలం 40 పైసలే తిరిగి కేటాయించడం వల్ల రాష్ట్రం అభివృద్ధి కాదు.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపాల్సిన వాటా పంపాలి.

విద్యాశాఖకు కేటాయింపులు అరకొరే

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్



కంఠేశ్వర్:కాంగ్రెస్ పార్టీ విద్యారంగానికి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 15శాతం హామీకి ఆమడదూరంలో కేటాయింపులు చేశారు. ఈ సంవత్సరం రూ.304,965 కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి కేటాయించింది కేవలం రూ.23108 కోట్లు (7.57శాతం) మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం రూ.274058 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది రూ.21292 కోట్లు (7.77శాతం) అని, అయితే అంకెల్లో రూ.1816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ శాతాల్లో చూస్తే గత సంవత్సరం కంటే 0.20 శాతం తగ్గింది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను గాలికి వదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడడం శోచనీయం, గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమేనని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 16 లక్షలు. వారిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారు మరియు బాలికలు ఉన్నారు. వీరికి నాణ్యమైన విద్య అందించడానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవు. విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, మెరుగైన మధ్యాహ్నభోజనం అందించేందుకు, నాణ్యమైన విద్యను అందించడానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి.

ప్రజాపాలనా బడ్జెట్ అంటేనే ఇదీ

ఆదే ప్రవీణ్ కుమార్ జిల్లా కన్వీనర్ తెలంగాణా బీసీ మహాసభ

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఇప్పటి వరకు మెజారిటీ ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబ బంధువుల ఎదుగుదల కోసం వచ్చిన ప్రయోజనకరనమైన బడ్జెట్‌లో మొదటి స్థానంలో ఉండే బడ్జెట్ కూడా ఇదే. ఇయ్యాల మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాలనలో మన ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ తెలంగాణా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకులో అత్యుంతమైనది కూడా ఇదే. ఇటు మన రైతన్నలకూ రైతు భరోసా కింద 18వేల కోట్లు వ్యవసాయ శాఖకూ ఇస్తూనే ఇంకా వ్యవసాయశాఖకు కూడా 24వేల కోట్లు ఇవ్వడం మాములు విషయంలా లేదు. ఇటు మన బీసీ కుటుంబ బంధువులకూ 11వేల కోట్లు, ఎస్సీలకు 40వేల కోట్లకు పైన, ఎస్టీలకు 17వేల కోట్లకు పైన బడ్జెట్‌లో పెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఇటు మన యువత కోసం 6000 కోట్లకు పైగా రాజీవ్ యువ వికాసం కింద ప్రకటించడం గొప్ప విషయం. ఇందిరమ్మ ఇండ్ల కింద ఈ ఒక్క సంవత్సరం బడ్జెట్ లోనే 12500 కోట్లకు పైనే అంటే మామూలు విషయం కాదు. అందుకే కాంగ్రెస్ అంటేనే పేద ప్రజల పక్షపాతి అని మరోసారి ఈ బడ్జెట్ ద్వారా నిరూపితం అయ్యింది.

పరీక్ష అట్టలు, పెన్నులు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

పాల్వంచ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని ప్రముఖ విద్యా సంస్థల అధినేత కేశిరెడ్డి గురువెందర్ రెడ్డి బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మంట్లాడుతూ ప్రతీసంవత్సరం ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సం., కూడా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసి పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను, పెన్నులను అందజేసినట్టు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించా లన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాతమధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, పీజేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమర్, మంజీరా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల దశాబ్దాల కల నెరవేరింది



మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

30 ఏళ్ల మాదిగల ఆకాంక్ష.. దశాబ్దాల కల నెరవేరిందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ మైలారం బాలు మాదిగ అన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సుదీర్ఘ పోరాటం తర్వాత గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పైన తీర్పునిచ్చిందన్నారు. ఏక సభ్య కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసి సుమారు ఆరు నెలల తర్వాత నిన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. మాదిగ అమరుల త్యాగాల ఫలితం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పోరాటంవల్ల వర్గీకరణ చేశారన్నారు.ఎమ్మార్పీఎస్ ఉద్యమం నేడు దేశ చరిత్రలో కీలక అధ్యయనాన్ని నెలకొల్పిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్యామ్ మాదిగ, మాజీ కౌన్సిలర్ రింగుల భూషణ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మైలారం రాము, మండల ప్రధాన కార్యదర్శి నూతుపల్లి సంతోష్, జిల్లా సీనియర్ నాయకులు నాగం ప్రదీప్,అరుంధతి నగర్ ఎంఆర్పిఎస్ శాఖ అధ్యక్షులు జంగం గోపి, మండల సలహాదారులు రాజ గంగారం, ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు సంకేపల్లి విప్లవ్,ఎమ్మెస్ ఎఫ్ కనకా శ్రీదిప్,ఎక్స్ ఎంపిటిసి సాయన్న ,రాజలింగం, ఇందూరు నవీన్, బుసొల్ల గంగాధర్, నడిపి గంగారం రవి, సంతోష్ పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ బి సురేఖ తెలిపారు. బుధవారం జరిగిన కెమిస్ట్రీ, కామర్స్, పరీక్షలకు 232 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 227 మంది విద్యార్థులు హాజరయ్యారని ఐదుగురు విద్యార్థులు గైరాజరయ్యారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల ద్వారా
ధాన్యం కొనుగోలు సజావుగా సాగాలి

• కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
• ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలి
• రబీ ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. రైతులు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు. రబీ వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం ఆయా శాఖల అధికారులతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, ఐకెపి సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 20వ తేదీ నుండి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో యాసంగిలో సాధారణానికి మించి అధిక విస్తీర్ణంలో వరి పండించారని, లక్షా 69 వేల హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో వరి సాగు చేశారని అన్నారు. మొత్తం 11.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేయగా, 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఇందులో 6.80 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం, దొడ్డు రకం 2.20 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని నిర్ణయించామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈసారి జిల్లాలో 664 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో సన్న ధాన్యం సేకరణ కోసం 472 కేంద్రాలు, దొడ్డు ధాన్యం సేకరణకు 192 కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ వివరించారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో అత్యధికంగా 481 కేంద్రాలు, ఐకెపి 107, డీసీఎంఎస్ ద్వారా 68, మెప్మా ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300 ధర చెల్లించడం జరుగుతుందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ రైతులకు అవసరమైన అన్నిమౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద తగిన నీడ, నీటి వసతి కల్పించాలన్నారు. సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయి మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ చేయాలని, ఏమైనా సమస్యలు గమనించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. రైతుల నుండి ధాన్యం సేకరించిన వెంటనే టాబ్ ఎంట్రీలు జరపాలని, తద్వారా వారికి త్వరితగతిన చెల్లింపులు జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. బిల్లుల చెల్లింపుల్లో అనవసర తప్పిదాలకు పాల్పడుతూ, నిర్లక్ష్యానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా అవసరమైన సంఖ్యలో హమాలీలు ఏర్పాటు చేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు.

నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కాగా, రైతులు దళారులకు ధాన్యం కట్టబెట్టి మోసపోకుండా, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజా గౌడ్, జెడ్పి సిఈఓ సాయాగౌడ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, మెప్మా పీ.డీ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా

పోలీసు అధికారులతో సమావేశంలో ఎస్పి యం. రాజేష్ చంద్ర



పోలీసు అధికారుల సమావేశంలో ఎస్పీ రాజేష్‌చంద్ర

నవతెలంగాణ-కామారెడ్డి

రౌడీలు అనుమా నితులుగా ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర అన్నారు. బుధవారం జిల్లా లో వివిధ పోలీస్ స్టేషన్ (యస్ ఐ) ఎస్ హెచ్ ఓ లతో మాట్లాడి అక్కడ ఉన్న పరిస్థితులను తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి, ప్రతి గ్రామానికి సంబంధించిన సమాచారం వెంటనే తెలుసుకొనుట కొరకు ప్రతీ గ్రామానికి ఒక పోలీసు అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివరణకై అన్ని స్థాయిల అధికారులు దృష్టి సారించాలనీ, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు అని పోలీసులకు హెచ్చరించారు. ఈ - పెట్టి కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నేరాలు నియంత్రన చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో చైతన్య రెడ్డి ఏఎస్పి కామారెడ్డి , అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, సత్యనారాయణ, స్పెషల్ బ్యాచ్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ మురళి, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు

పది విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని పద్మాజివాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి హాల్ టికెట్‌లు అందించారు. 21వ తేదీ నుంచి జరుగబోయే వార్షిక పరీక్షల్లో అనుసరించవలసిన నియమ నిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. కాగా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వారు విద్యార్థులకు పరీక్ష అట్టలు, హాల్‌టికెట్ కవర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎమ్మార్వో ఉమలత

నవతెలంగాణ-రామారెడ్డి



రామారెడ్డి మండల నూతన ఎమ్మార్వో గా బుధవారం ఉమాలత బాధ్యతలను స్వీకరించారు. గతంలో పనిచేసిన సువర్ణ బదిలీల్లో భాగంగా బాన్సువాడ వెళ్ళగా, ఆ స్థానంలో ఉన్నత అధికారులు ఉమా లతను కామారెడ్డి కలెక్టర్ ఆఫీస్ నుండి రామారెడ్డి తాసిల్దారుగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... రెవెన్యూ శాఖ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న, చట్టపరంగా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గాంధారి తహసీల్దార్‌గా రేణుక

నవతెలంగాణ-గాంధారి



జిల్లాలో తహసీల్దార్‌ల బదిలీలు జరిగిన నేపథ్యంలో గాంధారి నూతన తహసీల్దార్‌గా రేణుక చౌవన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలంలో గతంలో విధులు నిర్వహించి బదిలీపై గాంధారికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసిల్దార్‌కు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు.

పిట్లం తహసీల్దార్‌గా రాజా నరేందర్ గౌడ్

నవతెలంగాణ-పిట్లం



పిట్లం తహసీల్దార్‌గా రాజా నరేందర్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన లింగంపేట్ నుంచి బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడ పని చేసిన వేణుగోపాల్ బిచ్కుందకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శీతల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడే ఉపాధ్యాయులకు గర్వంగా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఆ రంగాలలో ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయు అధ్యక్షులు కుశాల్, కార్యదర్శి పుట్ట శ్రీనివాస్ రెడ్డి, సామాజిక కార్యకర్త కిషోర్, బాన్సువాడ పి ఆర్ టి యు అధ్యక్ష కార్యదర్శులు పాఠశాల ఉపాధ్యాయులు జోసెఫ్, సమత, ప్రవీణ్ కుమార్, రమాదేవి ,సంతోష్ కుమార్ హిమబిందు, జావిద్, సంతోష్, సిఆర్పి శ్రీధర్ కుమార్, వరలక్ష్మి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

